




ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి



శివాయ.. రుద్రాయ

- అంతటా శివనామస్మరణ
- భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- నేత్రపర్వంగా లింగోద్భవ అభిషేకాలు
- కిక్కిరిసిన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి
- స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



పట్టు వస్త్రాలు తెస్తున్న గోపిరెడ్డి దంపతులు

ఓం నమః శివాయ.. శంభో శంకరా.. శివాయ రుద్రాయ.. నామస్మరణతో శైవక్షేత్రాలు మారుమోగాయి. మహాశివరాత్రి పర్వదినం.. కోటయ్యస్వామి తిరునాళ్లతో శుక్రవారం భక్తులు పులకించి.. తరించారు. శైవక్షేత్రాలు భక్తజనంతో నిండిపోయాయి. శివయ్య దర్శనానికి భక్త జనసందోహం పోటెత్తింది. స్వామివార్లను దర్శించుకుని భక్తులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వీఐపీలు, ప్రముఖుల తాకిడితో కోటప్పకొండ, క్వారీ, గోవాడలతో పాటు అమరావతి, పెదకాకాని ఆలయాలు కిటకిటలాడాయి. విద్యుత్ దీపాలంకరణలతో నిర్మించిన ప్రభలను ఉత్సవంగా ఆలయాల వద్దకు భక్తులు తరలించారు. హర.. హరా.. చేదుకో కోటయ్య.. చేదుకో వయ్యా.. అంటూ తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు కోటయ్య క్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చారు. త్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది.

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: ప్రఖ్యాత శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి శుక్రవారం భక్తులతో పోటెత్తింది. కొండ ప్రాంత మంతా జన సంద్రమైంది. సాయంత్రం నుంచి యాత్రికుల రద్దీ అంతకంతకు పెరిగింది. అర్ధరాత్రి స్వామికి లింగోద్భవ అభిషేకం వైభవంగా జరిగింది. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో స్వామికి ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టు వస్త్రాలు, వెండి ప్రభను సమర్పించారు. తెల్లవారుజామున అర్చకులు బిందె తీర్థంతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు జరిపి స్వామికి విశేష అలంకారం చేశారు. అనంతరం స్వామి దర్శనానికి భక్తులను అనుమతించారు. కొండ దిగువన బొచ్చు కోటయ్యస్వామి వద్ద తల నీలాలను భక్తులు సమర్పించారు. కొండపైన ఉన్న పాతకోటేశ్వర స్వామి, పాపవినాశేశ్వర స్వామి, దిగువన ఉన్న విఘ్నేశ్వరస్వామి, సోపానమార్గంలోని ఆనందవల్లి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. ధ్యాన శివుడు, విఘ్నేశ్వరుడు, నంది, నాగేంద్రస్వామి పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. రెండు అభిషేక మండపాల్లో వేలాది మంది భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఎప్పటికప్పుడు ఈవో శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షించారు. 3,000 పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్, ఐజీ పాలరాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, ఆర్డీవో సరోజ డీఎస్పీ వర్మలతో పాటు వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలిస్తూ భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి 528కి పైగా ప్రత్యేక ఆర్టీసీ బస్సులను కొండకు ఏర్పాటు చేశారు. యాత్రికులకు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు సత్యసాయి సేవా సమితి, స్కౌట్ విద్యార్థులు క్యూల్లోని భక్తులకు మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండ దిగువన పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల కళా పరిషత్, నవ భారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి నిర్వహించారు. కొండ దిగువన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

కనువిందు చేసిన ప్రభలు

తికోటేశ్వరస్వామి తిరునాళ్లకు వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన 21 భారీ విద్యుత్ ప్రభలు కొండలో కొలువు దీరాయి. ఉదయం 11 గంటల కల్లా భారీ విద్యుత్ ప్రభలు కొండకు చేరుకున్నాయి. చిలకలూరిపేట రహదారిలో విద్యుత్ ప్రభల ఉత్సవం శోభాయమానంగా సాగింది. నరసరావుపేట రహదారిలో సాధారణ ప్రభలతో కోలాహలం నెలకుంది. ఆలయం, ప్రభల వెలుగులతో కొండ ప్రాంతం దేదీప్యమానంగా వెలుగొందింది. ప్రభల విద్యుత్ కాంతులు భక్తులకు కనువిందు చేశాయి. తెల్లవార్లు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు.

ట్రాఫిక్ జామ్.. భక్తులు అవస్తలు

కోటప్పకొండ ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామైంది. వీఐపీ బస్సు బ్రేక్ డౌన్‌తో పెద్దసంఖ్యలో బస్సులు నిలిచిపోయాయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు గంటన్నర పాటు బస్సులు లేక భక్తులు అల్లాడి పోయారు. నరసరావుపేట కోటప్పకొండ రోడ్డులో గురవపాలెం సమీపంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. కొండకు వెళ్లే భక్తులకు ట్రాఫిక్ కష్టాలు ఎదురయ్యాయి. పోలీసులు వన్ వే నిర్వహించినా వాహన చోదకులు నిబంధన పాటించకపోవడంతో పలుచోట్ల ట్రాఫిక్ జామైంది. పెట్లూరివారిపాలెం గ్రామం వద్ద వినుకొండ రోడ్డులో కొండకు ప్రభను తరలిస్తున్న సమయంలో సుమారు రెండు కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.



వేలల్లో పాసులు.. ఆదాయానికి గండి

త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వీఐపీ, వీవీఐపీ పాసులను పెద్దసంఖ్యలో జారీ చేశారు. డీఆర్వో కార్యాలయం నుంచి 20 వేలకు పైగా పాసులు పంపిణీ చేసినట్లు సమాచారం. వీఐపీల పేరుతో వేలాది మంది స్వామి దర్శనం చేసుకున్నారు. ఒక్కొక్క వీఐపీ వెంట అధిక సంఖ్యలో వారి అనుచరులు తరలివచ్చారు. వీఐపీల కారణంగా ఉచిత, రూ100 క్యూల్లోని భక్తులు స్వామిదర్శనం కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా వీఐపీ పాసుల జారీతో ఆలయ ఆదాయానికి గండి పడింది. వీఐపీల వాహనాలను కొండపైకి అనుమతించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీఐపీల సేవలో కొందరు అధికారులు తరించారు.





గోవాడలో మహిళల పొంగళ్లు

గోవాడకు భక్తుల తాకిడి

అమృతలూరు: ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం భక్త జన సందోహంతో కిటకిటలాడింది. ప్రత్యేక పూజలు అనంతరం అర్ధరాత్రి 1 గంట నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామి దర్శనానికి శుక్రవారం ఉదయం నుంచి భక్తుల తాకిడి ప్రారంభమైంది. అభిషేక మండపంలో అభిషేకాలకు భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంతో పాటు స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో భక్తుల రద్దీ నెలకుంది. ట్రాక్టర్లపై రైతులు తరలివచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులకు తాగునీటి ప్యాకెట్లు, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు. సామాజిక సత్రాల్లో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.



స్వామి వారి అభిషేకాన్ని తిలకిస్తున్న భక్తులు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు



కొండ ఘాట్‌రోడ్డులో ఆగిపోయిన బస్సు





- ప్రభల వద్ద రికార్డింగ్ డాన్సులు



భక్తులకు దారి పొడవునా ట్రాఫిక్ కష్టాలే...

అమరేశ్వరుడికి అభిషేకాలు

అమరావతి: పంచారామాల్లో ప్రసిద్ధమైన అమరారామంలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి బిందె తీర్థం, అ భి షే కాలు జరిగాయి. కృష్ణానదిలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షవర్ల వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకు నేం దుకు క్యూల్లో బారులు తీరారు. లింగోద్భవకాలంలో అభిషేకాలు జరిగాయి.



అమరావతిలో భక్తుల క్యూ

క్వారీకి పోటెత్తిన భక్తులు

పొన్నూరుటౌన్: మహిమాన్విత శైవక్షేత్రం క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. చేబ్రోలు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పొంగళ్లను వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. వడ్లమూడి నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్ధపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించి స్వామి ఆలయానికి తరలించారు. స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచి నీరు, మజ్జిగ, ప్రసాదాలను పంపిణీ జరిగింది. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పలు ప్రభల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



క్వారీలో సుద్ధపల్లి యాదవపాలెం విద్యుత్ ప్రభ

కాకాని మల్లన్నసన్నిధి.. కిటకిట

పెదకాకాని: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కాకానిలోని మల్లన్నసన్నిధి భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయం ఎదుట ఉన్న యజ్ఞాల బావి వద్ద భక్తులు పవిత్ర స్నానం ఆచరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించి మల్లేశ్వరస్వామి వారికి అభిషేకాలు జరిపించారు, భ్రమరాంబ అమ్మవారికి కుంకుమ పూజ జరిపించారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి ఏకాదశ ద్రవ్యాలతో వేదపండితులు అభిషేకాన్ని జరిపించారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో భక్తులు పరవశించి పోయారు. గజవాహనంపై ఉభయదేవేరి సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.



పెదకాకాని మల్లికార్జునుడి సన్నిధిలో కిక్కిరిసిన భక్తులు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి

- త్రికాయ నృత్య ప్రదర్శనల ప్రారంభోత్సవంలో బ్రహ్మణి

మంగళగిరి సిటీ, మార్చి 8: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సతీమణి బ్రహ్మణి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం తూర్పు రాజగోపురం ఎదురుగా టీటీడీ కల్యాణ మండపం వద్ద త్రికాయ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి, బ్రహ్మణి జ్యోతి ప్రజ్వలన చేసి నృత్య ప్రదర్శనలను ప్రారంభించారు. త్రికాయ నృత్యశాల ఆధ్వర్యంలో ప్రదర్శించిన పలు నృత్యాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల అనంతరం బ్రహ్మణి మాట్లాడుతూ మహాశివుడు తన శరీరంలో అర్ధభాగాన్ని పార్వతీదేవికి ఇచ్చి మహిళామూర్తుల పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారని తెలిపారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన భారతీయ విలువలు, సంస్కృతిని భావి తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం సాంస్కృతిక, ఆధ్యాత్మిక నృత్యాలను ప్రదర్శించిన త్రికాయ నృత్యశాల బృందానికి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఈ కార్యక్ర మంలో మంగళగిరి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నందం అబద్దయ్య మహిళా నేతలు పాల్గొన్నారు.





నృత్య ప్రదర్శనలను తిలకిస్తున్న వసుంధర దేవి, బ్రహ్మణి

దేవుని వాక్యం బలమైనది

- పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్
- రెండోరోజు భక్తిశ్రద్ధలతో కొనసాగిన గుడారాల పండుగ



ప్రార్థనల్లో పాల్గొన్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహాం, పాస్టర్ రాజు, పాల్గొన్న ఆనందబాబు, రామాంజనేయులు, పెమ్మసాని, ఆలపాటి తదితరులు

6లో..

వచ్చేనెల 7వ తేదీ వరకు 12 రైళ్ల రద్దు

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 12వ తేదీ నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకు 12 రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు.07783 విజయవాడ - గుంటూరు, 07788 గుంటూరు - విజయవాడ, 07779 గుంటూరు - మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, నెంబరు. 07579 నడికుడి - మాచర్ల, నెంబరు.07628 విజయవాడ - గుంటూరు, 07464 విజయవాడ - గుంటూరు, 07465 గుంటూరు - విజయవాడ, 07786 గుంటూరు - రేపల్లె, 07873 రేపల్లె - తెనాలి, 07630 తెనాలి - విజయవాడ రైళ్లను ఏప్రిల్ 7వ తేదీ వరకు రద్దు చేశామన్నారు. నెంబరు. 17282 నరసపూర్ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ విజయవాడ వరకే ప్రయాణిస్తుందని చెప్పారు. ఈ కారణంగా నెంబరు. 17281 గుంటూరు - నరసపూర్ రైలు విజయవాడ నుంచి నరసపూర్‌కు వరకు వెళుతుందన్నారు.

రైలు కింద పడి ఇద్దరి మృతి

వినుకొండటౌన్, మార్చి8: ప్రమాదవశాత్తు రైలు కింద పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన ఇందిరానగర్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. బహిర్భూమికి వచ్చి ప్రమాదవ వశాత్తు రైలుకింద పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 65 సంవత్సరాలు ఉండవచ్చని, శరీరంపై తెల్లటి చొక్క, పంచె ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆచూకి తెలిసిన వారు 9440438256 ఫోన్ నెంబర్ సంప్రదించాలన్నారు. అదేవిదంగా కురిచేడు సమీపంలో సాఫ్టువేర్ ఉద్యోగి యర్రగొండ రవికుమార్ (38)అనే యువకుడు రైలు క్రింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ప్రకాశంజిల్లా, దర్శి మండలం తానంచితలకు చెందిన వ్యక్తిగా గుర్తించి, బంధువులకు సమాచారం అందినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు.

నవ్యాంధ్ర సుభిక్షంగా ఉండాలి..

● మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



బొప్పూడి ప్రభను సందర్శించిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 8: పాలకుల చేతిలో మోసపోయిన నవ్యాంధ్రను కాపాడాలని, పల్నాడు ప్రజల కొంగు బంగారం త్రికోటేశ్వరుని ప్రార్థించినట్టు మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ నాయ కులతో కలసి ఆయన త్రికోటేశ్వరుని దర్శించుకు న్నారు. రాబోయే రోజుల్లో ప్రజల బాధలు తీర్చే సర్కారు రావాలని ప్రత్యేక పూజలు చేసినట్టు తెలిపారు. పరమ శివుడు దక్షణా మూర్తి రూపంలో ఉన్న ఏకైక క్షేత్రం కోటప్పకొండ కావటం ఇక్కడి ప్రజల అదృష్టంగా ఆయన వివరించారు. అనంతరం కావూరు, బొప్పూడి, కమ్మవారిపాలెం, గోవిందాపురం, యడవల్లి, మద్దిరాల, అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం, కోమటినేని వారిపాలెంల నుంచి వచ్చిన ప్రభలను సందర్శించి పూజలు నిర్వహించారు. ప్రభలు నిర్మించిన టీడీపీ శ్రేణులకు అభినందనలు తెలిపారు. అనంతరం కాకతీయ అన్నదాన సత్రంలో అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్రం నిర్వాహకులు ప్రత్తిపాటిని ఘనంగా సత్కరించారు.

దేవుని వాక్యం బలమైనది

పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్ ● రెండోరోజు భక్తిశ్రద్ధలతో కొనసాగిన గుడారాల పండుగ





రెండవరోజు జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహం, పాస్టర్ రాజు, హాజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), మార్చి8: దేవుని వాక్యం బలమైనదని, ఆ వాక్యం ద్వారా కుంగినవాడు కూడా విడుదల పొందుతాడని పాస్టర్లు జాన్‌వెస్లీ, రమేష్‌లు సందేశమిచ్చారు. గోరంట్ల సమీపంలో జరుగుతున్న 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ రెండోరోజైన శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది విశ్వాసుల పాల్గొన్నారు. ఉదయం ప్రార్థనలను యర్రగొండపాలెంకు చెందిన మోజేష్‌లు ప్రారంభించి సందేశమిచ్చారు. రెండవ ప్రసంగాన్ని నల్గొండకు చెందిన పాస్టర్ సైమన్, ఒంగోలుకు చెందిన పాస్టర్ రాజు సందేశమిచ్చారు. అనంతరం పాస్టర్లు రమేష్, జాన్‌వెస్లీలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనసు మార్చుకుని పరిశుద్ధ ఆత్మతో జీవించాలని సందేశమిచ్చారు. ఈ సందర్భంగా హోసన్న సువార్త గాయకులు ప్రేమ పూర్ణుడా, ఘనమైనవి నా కార్యాలు అనే గీతాలను ఆలపించారు. సాయంత్రం ప్రార్థనలను మచీలిపట్నంకు చెందిన రాజేష్ ప్రారంభించి దేవుని వాక్యాన్ని ఉపదేశించారు. అద్దంకి నుంచి అంధులు చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. అర్ధరాత్రి ప్రార్థనల్లో హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహం ప్రసంగించారు.

ఈ స్థలం పవిత్రమైనది : పెమ్మసాని

ఈ స్థలం పవిత్రమైనదని దీనిని బలపరిచిన హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్లు, నిర్వాహకులను అభినందిస్తున్నట్టు గుంటూరు పార్లమెంటు టీడీపీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు, గోరంట్ల, హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న గుడారాల పండుగ రెండవ రోజున జరిగే ప్రార్థనలలో టీడీపీ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాదు, నక్కా ఆనంద్‌బాబు, బూర్ల రామాంజనేయులు, మద్దిరాల మ్యానీ, ఇతర జనసేన, టీడీపీ నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ 1977లో 80 మందితో మొదలైన పండుగ నేడు ఐదు లక్షల మందికి చేరుకొందంటే దాని వెనుక ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉన్నాయన్నారు. శాంతి ప్రేమ పంచడానికి ఏసుక్రీస్తు జన్మించారని ఆయన మార్గంలో నడవాలని కోరారు. కక్షతో గాకుండా క్షమాభిక్షతో జీవించాలని తెలిపారు. దేవుని ఆశీర్వాదం పొంది ప్రతి ఒక్కరు ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు అనంతరం హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షులు అబ్రహం, చీఫ్ పాస్టర్, జాన్‌వెస్లీ, పాస్టర్లు రాజు, రమేష్ ఫ్రైడి పాల్ చేసిన ప్రార్థనల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు.

కోటప్పకొండ.. భక్తజనసంద్రం

త్రికూటాద్రిలో తిరునాళ్ల సందడి.. వీఐపీల రద్దీ.. వారి సేవలో అధికారులు.. సత్రాల్లో లక్ష మందికి అన్నప్రసాద వితరణ

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 8: ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిధి శుక్రవారం భక్తజన సంద్రంతో నిండిపోయింది. కోటయ్యస్వామి తిరునాళ్ల కన్నుల పండువగా జరిగింది. లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకొని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సోపాన మార్గంలో కూడా భక్తులతో రద్దీ నెలకొంది. అర్ధరాత్రి వరకు కొండకు భక్తులు తరలివస్తూనే ఉన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండ ఎగువున, దిగువున ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మందలు పంపిణీ చేశారు.

తిరునాళ్లలో త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు ఘాట్ రోడ్డు మార్గంలోని పర్యాటక కేంద్రాన్ని సందర్శిం చారు. ఇక్కడ యాత్రికుల సందడి నెలకుంది. చిన్నారులు, పెద్దలు అందరూ బోట్ షికార్ చేశారు. పిల్లల రాజ్యం పార్కులో చిన్నారులు ఆట వస్తువులతో ఉత్సాహంగా ఆడుకున్నారు. పర్యాటక కేంద్రంలోని జింకలు, పక్షులు, నెమళ్లు, అక్వేరియంలను సందర్శించారు. కొండ దిగువున వున్న స్టాల్స్‌లో ఆట వస్తువులు, చెరకుల విక్రయాలు జరిగాయి. రంగుల రాట్నాలతో యాత్రికులు సందడి చేశారు. కొండ దిగువున పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దివ్యాంగుల కళా పరిషత్, నవభారత దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభా వంతులు దివ్యాంగుల చేత సంగీత విభావరి నిర్వహించారు. కొండ దిగువున వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

నరసరావుపేట మండలం కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం, చిలతలపాలెం నుంచి ఒక్కొక్క ప్రభ కొండలో కొలువుదీరాయి. పురుషోత్తపట్నం నుంచి 6, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలివచ్చాయి. తెల్లవార్లు ప్రభలపై సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణం, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో సాధారణ ప్రజలు కొండకు తరలి వచ్చారు.

స్వామివారిని దర్శించుకున్న ప్రముఖులు

కోటయ్య స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు. మంత్రి అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మద్దాళి గిరి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి. కలెక్టర్ శివశంకర్, ఐజీ పాలరాజు ఎస్పీ రవిశంకరరెడ్డి, జేసీ శ్యాంప్రసాద్, ఆప్కో చైర్మన్ చిరంజీవి తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

పెద్ద ఎత్తున అన్నదానం

కొండ దిగువున ఉన్న సామాజిక సత్రాలలో పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఒక్కొక్క సత్రంలో వేలాది మందికి అన్నదానం జరిగింది. సత్రాలలో లక్ష మందికి పైగా అన్నదానం జరిగింది. కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ, యోగి వేమారెడ్డి, ముదిరాజులు, శాలివాహన, నాయీబ్రాహ్మణ, రజక, బ్రాహ్మణ, ఆది శైవ, వీర శైవ, విశ్వ బ్రాహ్మణ, తొగటి వీర క్షత్రియ తదితర సామాజిక వర్గాల సత్రాలలో భారీగా అన్నదానం జరిగింది.

ఎన్నికల బాండ్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు



మహిళా ప్రణాళికను ఆవిష్కరిస్తున్న వీ శ్రీనివాసరావు, పాశం రామారావు తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి 8: ఎన్నికల బాండ్ల రూపంలో ఆయా రాజకీయ పార్టీలకు చేరిన నిధులపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దేశంలో ఎన్నికల బాండ్లు అనేది పెద్ద అవినీతి అని, దాదాపు రూ.64వేల కోట్ల నల్లధనం ప్రధాన పార్టీల వద్ద ఉందని సాక్షాత్తూ సుప్రీంకోర్టు చెబుతోందని గుర్తుచేశారు. శుక్రవారం గుంటూరు, బ్రాడీపేట సీపీఎం కార్యాలయంలో మహిళ ప్రణాళిక అమలుపై రూపొందించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి లేకనే మోదీ అయోధ్య రామాలయం పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. పారదర్శక పాలన కేవలం ఇండియా కూటమితోనే సాధ్యమవుతుందన్నారు. మోదీ, జగన్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని, అందుకే మహిళా ప్రణాళిక అమలుకై సీపీఎం ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నాయకులు డి.లక్ష్మీనారాయణ, ఈమని అప్పారావు, భైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా కోడి పందాలు

● మునమాక, రొంపిచర్ల వద్ద నిర్వహణ
● అధికార పార్టీ నేతల అధ్వర్యంలోనే..



రొంపిచర్ల మండలం మూనమాక సమీపంలో కోడి పందాలు

నరసరావుపేట, మార్చి 8: అధికార పార్టీ అండదండలతో శుక్రవారం కోడి పందాలు జోరుగా సాగాయి. వరుసగా ఐదవ ఏడాది పందాలు నిర్వహించి పోలీసు శాఖకు నేతలు సవాలు విసిరారు. సందట్లో సడేమీయా చందాన పోలీసులు కోటప్పకొండ తిరునాళ్ల బందోబస్తులో ఉన్న నేపథ్యంలో అధికార పార్టీ నేతలు రెండు చోట్ల బరులు ఏర్పాటు చేసి పందాలు నిర్వహించడం గమనార్హం. నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలంలో రెండుచోట్ల పందాలు బహిరంగంగానే జరిగాయి. గతంలో అధికార పార్టీ నేతలు కలసి ఒక చోటే పందాలు ఏర్పాటు చేసేవారు. ఈసారి అధికార పార్టీ నేతలు ఇరు వర్గాలుగా విడిపోయి రెండు చోట్ల పందాలు నిర్వహించారు. మునమాక సమీపంలో, రొంపిచర్ల వద్ద రెండు చోట్ల పందాలు జరిగాయి. గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి కూడా పందెం రాయుళ్ల పందెంలో పాల్గొన్నట్టు చెబుతున్నారు. మద్యం అమ్మకాలు పెద్దఎత్తున జరిగాయి. ఒక్కో పోటీకి లక్షల్లో చేతులు మారాయి. పోలీసు శాఖకు సమాచారం అందినా మిన్నకున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రొంపిచర్ల మడలంలో మాత్రం శివరాత్రి కోడి పందాలు నిర్వహించడం అధికార పార్టీ అనవాయితీగా కొనసాగిస్తోంది.

తిరునాళ్లలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

కోటప్పకొండ తిరునాళ్లలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరిగాయి. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు అక్రమార్కులు పంచన చేరిపోయారు. తిరునాళ్ళ సందర్భంగా కోటప్పకొండకు 10 కిలోమీటర్ల వరకు మద్య నిషేదాన్ని ఎక్సైజ్ శాఖ విధించింది. ఇది అమలు కాలేదు. యాటీ సమీపంలోని ప్రభుత్వం మద్యంషాపు నుంచి మద్యం నిల్వలను బయటకు తరలించారు. ఈ విషయం ఎక్సైజ్ శాఖ దృషికి తీసుకువెళ్ళినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ షాపుకు సంబంధించిన మద్యంను బ్లాక్‌లో విక్రయించారు. పెద్ద ఎత్తున మద్యం విక్రయాలు జరిగినా నామమాత్రంగా కూడా సదరు అధికారులు చర్యలు తీసుకోకపోవండంపై వారిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



చేతులకు సంకెళ్లు వేసుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

అప్పుల ఊబిలోకి రాష్ట్రాన్ని నెట్టారు

● 1543 రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి 8: రాష్ట్ర బాగోగులు గాలికి వదిలేసి, సంపద కేంద్రం రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారని 33వేల ఎకరాలు అమరావతి నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, మూడు రాజధానులు వద్దు, అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా కొనసాగించాలని రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 1543వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ, అమరావతిని అభివృద్ధి చేయటం చేతకాని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతామని అనటం విడ్డూరంగా ఉందన్నారు. వేల ఎకరాలు భూములిస్తే అమరావతి నిర్మాణం కొనసాగించలేకపోవటం సిగ్గు చేటన్నారు. మూడు ముక్కల ఆటతో అధోగతి పాలు జేశారన్నారు. అధర్మంగా పాలించబట్టే వందల సార్లు వైసీపీ ప్రభుత్వానికి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధి కాంక్షించే వాళ్ళైతే అమరావతిని రాష్ట ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం మాకొద్దు, మాకొద్దు అంటూ తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో చేతులకు సంకెళ్ళు వేసుకొని నిరసన వ్యక్తం చేశారు. సంక్షమాల పేరిట పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వం, మహిళలను నడిరోడ్డు మీద నిలబెట్టిన ప్రభుత్వం మాకొద్దు, మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి అమరావతి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీతోనే మహిళా సాధికారత : యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 8: రాష్ట్రంలో టీడీపీతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని గురజాల మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అలవికాని హామీలిచ్చిన జగన్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేకపోయాడని ఆరోపించారు. పద్నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన అనుభవం వున్న చంద్రబాబు, యువతకు మంచి భవిష్యత్ ఇవ్వాలన్న ఆశయంతో ఉన్న పవన్‌కల్యాణ్ తీసుకున్న నిర్ణయాలు ప్రజల కోసమేనని గుర్తుచేశారు. కలలకు రెక్కలు అనే సరికొత్త పథకాన్ని మహిళల కోసం టీడీపీ, జనసేన నేతలు తీసుకురావడం జరిగిందన్నారు. ఇంటర్ పూర్తిచేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఈ పథకం కింద నమోదు చేసుకున్న మహిళలు తీసుకునే బ్యాంక్ రుణాలకు టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం హామీగా వుంటుందని, అంతే కాకుండా మహిళలు తీసుకునే రుణానికి వడ్డీ కూడా టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ఎన్నికలలో ఓటమి తప్పదన్నారు. మహిళలకు మహిళాదినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ అన్నిరంగాల్లో వారు ముందుండాలని యరపతినేని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాండురంగ శ్రీను, కామిశెట్టి రమేష్, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సీత, పాదర్తి రాజేశ్వరి, షేక్ నాగుర్‌బి, తదితరులున్నారు.

డీసీటీవో సస్పెన్షన్

● రూ.10 కోట్ల బిల్లుల భోగస్ క్లెయిమ్‌ల వ్యవహారంపై చర్యలు


గుంటూరు, మార్చి 8: బ్రాడీపేట సర్కిల్‌లో బోగస్ డీలర్ ఇన్‌వాయిస్‌ల క్లెయిమ్ వ్యవహారంలో డీసీటీవో మంజులపై సస్పెన్షన్ వేటు పడింది. బోగస్ డీలర్ నుంచి రూ.10 కోట్ల వరకు వాణిజ్య పన్నులశాఖ ఖజానాకు నష్టం కలగటంపై జరిపిన విచారణలో డీసీటీవో నిర్లక్ష్యం తేలటంతో ఆ శాఖ చీఫ్ కమిషనర్ గుల్జార్ సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే బ్రాడీపేట సర్కిల్‌లో మహీంద్ర కాటన్ పేరుతో ప్రొప్రయిటర్ యర్రబోతుల మహీంద్ర రెడ్డి రిజిస్ట్రేషన్ చేయించుకొని వ్యాపారం నిర్వహించారు. కాగా బోగస్ ఇన్‌వాయిస్ బిల్లులు సృష్టించి క్లెయిమ్‌లు చేసుకోవటంతో సీటీ శాఖకు రూ.10 కోట్ల నష్టం కలిగినట్లు అధికారులు గుర్తించారు. అసలు విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. బ్రాడీపేట సర్కిల్ ఏసీగా వ్యవహరిస్తున్న స్వామి వివేకానంద సదరు కాటన్ క్యాపారి అడ్రస్‌కు వెళ్ళి పరిశీలించగా అక్కడ ఎవరూ లేకపోవటంతో పాటు బోగస్ వ్యాపార సంస్థ అని తేలినట్లు విచారణలో తేలింది. ఇందులో డీసీటీవో నిర్లక్ష్యం కారణంగా కోట్లలో నష్టం కలిగినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారు. డీసీటీవో సస్పెన్షన్ వ్యవహారం ఆ శాఖ వర్గాల్లో కలకలం రేకెత్తిస్తోంది.


పోలీసుల అదుపులో టీడీపీ నేతలు

మాచర్ల రూరల్, మార్చి 8: పోలీసులు ఇరువురు టీడీపీ నేతలను శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. మాచర్ల పట్టణంలో గత నెల 28వ తేదీన బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నేపథ్యంలో టీడీపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వైసీపీ నేతలు ఆ ఫ్లెక్సీలను చింపివేయడంతో టీడీపీ, వైసీపీ నేతల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో 12 మంది టీడీపీ నేతలపై పట్టణ పోలీస్‌స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదైంది. ఈ కేసులోని ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ శరత్ బాబు తెలిపారు. మిగిలిన వ్యక్తుల కోసం గాలింపు చేపట్టినట్లు చెప్పారు. అదుపులోకి తీసుకున్న ఇరువురు టీడీపీ నేతలను శనివారం కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ తెలిపారు. కాగా పోలీసుల అదుపులో విద్యాధరణి మురళి, నర్రా గురవారెడ్డి ఉన్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● శుభకార్యానికి వెళుతుండగా ఘటన





మృతి చెందిన జానీ బాషా, జమాల్

దాచేపల్లి, మార్చి 8: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న ఇరువురు వ్యక్తులు మలుపు వద్ద వున్న గోతులను తప్పించబోయి వాహనం జారిపడగా వారిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే తీవ్రగాయాలపాలై మృతి చెందిన ఘటన శుక్రవారం దాచేపల్లి మండలం తంగెడ గ్రామం వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. మాచవరం మండలం వేమవరం గ్రామానికి చెందిన షేక్ జానీబాష(45), సయ్యద్ జమాల్(50) వారి సమీప బంధువులు. జాన్‌పాడ్ దర్గాకు ఓ శుభకార్యం కోసం వేమవరం నుంచి ద్విచక్ర వాహనంపై వారిరువురు బయలుదేరారు. తంగెడ డీఏవీ స్కూల్ సమీపంలో వున్న గోతులను తప్పించబోతుండగా ఒక్కసారిగా వాహనంపై నుండి కిందపడ్డారు. రోడ్డుపై పడిన ఇరువురు వ్యక్తులపై నుంచిఇ వెనుకగా వస్తున్న లారీ ఢీకొట్టి వెళ్లింది. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దాడికి ప్రతీకారం.. పూరిళ్లకు నిప్పు

పిల్లలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఘటన ● 20లక్షల ఆస్తి అగ్నికి ఆహుతి



కాలిపోయిన నాలుగు పూరిళ్లు

వినుకొండ, మార్చి8: అర్ధరాత్రి ముగ్గురు చంటి పిల్లలను హతమార్చాలని గడిపెట్టి ఇంటికి నిప్పు అంటించడంతో, నాలుగుపూరిళ్ళు దగ్ధమై, సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం జరిగిన ఘటన పట్టణంలోని అంబేద్కర్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలను పరిశీలిస్తే.. పాములకాలనీకి చెందిన పులి వెంకటేశ్వర్లు, నాగులూరి జంపన్నలు బంధువులు. ఇద్దరి మధ్య గురువారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. ఇరువురి మధ్య పెద్దమనిషిగా వెళ్లిన పోలా శ్రీనుపై పులి వెంకటేశ్వర్లు అదే రాత్రి కత్తితో దాడిచేశాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీనును చూసి తమ్ముడు పోలా బంగారయ్య శుక్రవారం తెల్లవారుజామున పులి వెంకటేశ్వర్లు ఇంటిని తగలబెట్టాడు. ఇంట్లో నిదరపోతున్న శ్రీనిధి, దివ్య, అపర్ణలను స్థానికులు కాపాడినప్పటికి, పక్కనే ఉన్న పగిడి నారాయణ, పగిడి వెంకటేశ్వర్లు, పులి వెంకటరమణ నివాస గృహలు అగ్నికి ఆహుతయ్యాయి. జరిగిన ఘటనపై ఎస్ఐ ప్రసాద్‌ను వివరణ కోరగా సీఐ దృష్టికి తెచ్చామని, సీఐ కోటప్పకొండ బందోబస్తులో ఉన్నారని తెలిపారు. .

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న తెలుగు మహిళలు

మహిళా సాధికారత దిశగా టీడీపీ

దాసరి జ్యోతి, నేపాకా పద్మావతి

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత దిశగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేనాని పవన్ కల్యాణ్ ముందడుగు వేశారని తెలుగు మహిళా నేతలు దాసరి జ్యోతి, నేపాక పద్మ అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర(నాని) పిలుపు మేరకు పశ్చిమ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసి 'కలలకు రెక్కలు పథకం' కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కలలకు రెక్కలు' అనే పేరుతో ఓ సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకొచ్చారన్నారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డా డబ్బుల కొరతతో చదువుకు దూరం కాకూడదన్న ఆలోచనతో ఈ పథకాన్ని తెచ్చారన్నారు. ఏపీలో మహిళలకు వృత్తివిద్యకు మార్గాలను అందించడంతో పాటు వారికి మరింత ఉపాధి అవకాశాలు కల్పించడం ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఇంటర్మీడియట్ విజయవంతంగా పూర్తిచేసిన మహిళలు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. కార్యక్రమంలో సభాపతి విజయలక్ష్మి, వకుల దేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



హెల్త్ ప్యాకేజీ వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ సుస్మిత

గుంటూరు(మెడికల్), మార్చి 8: గుజనగుళ్లలోని శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ వై సుస్మిత ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో వైద్యులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా హాస్పిటల్‌లో హెల్త్ చెకప్ సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుస్మిత మాట్లాడుతూ 10-18 ఏళ్ల ఎదిగే ఆడపిల్లలకు నిర్వహించే రూ.5400 ఖర్చయ్యే వైద్యపరీక్షలను కేవలం రూ.2400కే చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మహిళలకు రూ.11,800 ఖర్చు అయ్యే వైద్య పరీక్షలను రూ.5400కే అందిస్తున్నామన్నారు. శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో సంప్రదించి ఈ వైద్యపరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకోవచ్చని డాక్టర్ సుస్మిత తెలిపారు. సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మీకాంతం మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంతో పాటు ఆర్థిక, సామాజిక రంగాల్లో ముందుండి పురుషులకు ధీటుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ కీర్తి, పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రియాంక, డాక్టర్ సరళవేణి, డాక్టర్ సౌమ్య, డైటీషియన్ పరిణితి తదితరులు పాల్గొన్నారు.

వికాస్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో...


సమావేశంలో మాట్లాడుతున్న వికాస్ హాస్పటల్స్ డైరెక్టర్ గళ్ళా మాధవి తదితరులు

గుంటూరు, మార్చి 8: నగరంపాలెంలోనున్న వికాస్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి టీ లీలావతి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలకు ఎటువంటి న్యాయపరమైన సమస్యలకు సూచనలు, సలహాలు అందిస్తామని తెలిపారు. వికాస్ హాస్పటల్స్ సిబ్బంది, తల్లులను, గర్భిణీలను సన్మానించటం, ప్రత్యేక బహుమతులు అందించటం అభినందనీయమన్నారు. వికాస్ హాస్పటల్స్ డైరెక్టర్ గళ్ళా మాధవి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మహిళా సమాజాన్ని నిర్మించటానికి తన వంతు పాత్రగా మహిళలకు, గర్భిణులకు సంస్థలోని డాక్టర్ల ద్వారా ఆరోగ్య సమాచారాన్ని, ప్రత్యేక రాయితీతో సేవలను మహిళా దినోత్సవం సందర్భంగా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంస్థలోని సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హాస్పటల్ సీఈవో మూర్తి, డాక్టర్ నిహారిక, డాక్టర్ కనకదుర్గ, డాక్టర్ శ్రావణి, డాక్టర్ శాలిని, సీవోవో ప్రణీత్, అడ్మినిస్ట్రేటర్ గళ్ళా అనూష తదితరులున్నారు.

మహిళా సాధికారత కోసమే 'కలలకు రెక్కలు'

కనుమూరి కృష్ణవేణి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మహిళా నేతలు

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మరో ముందడుగు వేశారని మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు కనమూరి కృష్ణవేణి అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ మహిళా నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రలో పుట్టిన ఏ ఆడబిడ్డా విద్యకు దూరం కాకూడదనే ఆలోచనతో 'కలలకు రెక్కలు' అనే పథకాన్ని తెచ్చారన్నారు. మహిళలకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. టీడీపీ అంగన్వాడీ, డ్వాక్రా ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి ప్రసన్న రాధిక మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులు మార్చారన్నారు. కార్యక్రమంలో పంచుమర్తి కల్పన, ఇత్తడి రత్నకుమారి కే విజయలక్ష్మి, వై.కృష్ణవేణి, ఎల్. వీరరత్నం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం క్రమశిక్షణ, కఠోర దీక్ష చేయాలి

● సీతారామయ్య హైస్కూలులో ముగిసిన వార్షిక వేడుకలు
● ముఖ్య అతిథిగా పాల్గొన్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు


ప్రసంగిస్తున్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, వేదికపై డాక్టర్ శివాజీ, దేవినేని మల్లికార్జునరావు, పాటిబండ్ల విష్ణు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 8: విద్యార్థులు లక్ష్య సాధన కోసం క్రమశిక్షణతో కూడిన కఠోర దీక్ష చేయాలని మిజోరాం రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు తెలిపారు. శుక్రవారం పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో జరిగిన వార్షిక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సభకు పాఠశాల కమిటీ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ యలమంచిలి శివాజీ అధ్యక్షత వహించారు. హరిబాబు మాట్లాడుతూ వైభవంగా సీతారామయ్య హైస్కూల్ ఉందన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. అత్యంత వైభవంగా అధునాతన సదుపాయాలతో సీతారామయ్య పాఠశాల నెలకొల్పడం రాబోయే తరానికి మంచి విద్యనందిస్తుందన్న ఆకాంక్షని ఇస్తుందన్నారు. విద్య, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చిన సీతారామయ్య గుంటూరులో పాఠశాల స్థాపించడం, లాంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థాపించడం ఆయన ముందుచూపుకు నిదర్శనమన్నారు. విద్యార్థులంతా తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. చదువుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఇతర అంశాల్లో కూడా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. ప్రైవేటురంగంలో కార్పొరేట్ విద్యనందిస్తూ తక్కువ ఫీజులతో ఉన్నత విద్యనందిస్తున్న కార్యవర్గాన్ని అభినందించారు.నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించే ప్రత్యేక కళాశాలలను మాత్రమే విద్యార్థులు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాఠశాల విషయంలో నిబద్ధతగా పనిచేయాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సూచించారు. మాజీ ఎంపీ శివాజీ మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను సీతారామయ్య ఆనాడే గుర్తించారన్నారు. ప్రస్తుతం విద్య, వైద్య రంగాన్ని చూస్తుంటే బాధేస్తోందన్నారు. నేడు జైల్లో ఉండాల్సిన వారు లోక్‌సభ, రాజ్యసభలో ఉంటున్నారని, న్యాయం ఎలా దొరుకుతుందన్నారు. నేరగాళ్లే విలువల గురించి మాట్లాడుతుంటే బాధేస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, గన్నమనేని విజయలక్ష్మి, పాఠశాల కమిటీ సభ్యులు గింజుపల్లి శివప్రసాదరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మిజోరం రాష్ట్ర గవర్నర్ హరిబాబుకు స్వాగతం

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మిజోరం రాష్ట్ర గవర్నర్ కంభంపాటి హరిబాబు శుక్రవారం జిల్లా పర్యటనకు వచ్చారు. స్థానిక నవభారత్‌నగర్‌లోని ప్రైవేటు అతిథిగృహంలో ఆయన బసచేయగా ప్రొటోకాల్ ప్రకారం గుంటూరు ఆర్డీవో శ్రీకర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. శనివారం ఆయన తెనాలి, గుంటూరు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం విజయవాడకు బయలుదేరి వెళతారు.

ఓం నమఃశివాయ..

● శివనామస్మరణతో మారుమోగిన శివాలయాలు
● ఉదయం నుంచే క్యూలలో భక్తులు...
● ప్రత్యేక అభిషేకాలు, పూజలతో ఆలయాల్లో రద్దీ


శివ లింగానికి అర్చకుల అభిషేకాలు, శివాలయంలో భక్తులు

గుంటూరు, మార్చి 8: ఓం నమఃశివాయ... హరహర మహాదేవ శంభోశంకర అంటూ శివనామస్మరణతో నగరంలోని శివాలయాలు మారుమోగాయి. మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం నగరంలో శివాలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ కనిపించింది. సంపత్‌నగర్, కొత్తపేటలోని శివాలయాలు, పాతగుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయం, బ్రాడీపేటలోని గౌరీ ఉమామహేశ్వరస్వామి ఆలయంతో పాటు అరండల్‌పేట, పట్టాభిపురం, అమరావతి రోడ్డు ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు పోటెత్తారు. అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి శివపార్వతీదేవి కల్యాణ మహోత్సవాన్ని ఆయా ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. చుట్టుగుంట పోలేరమ్మ తల్లి ఆలయ ఆవరణతోపాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి స్వామివారి లింగోద్భవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రేపు వాహన రాకపోకల దారి మళ్లింపు

జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, మార్చి 8: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలో మార్చి 10న జరగనున్న సిద్ధం సభ నేపథ్యంలో వాహన రాకపోకలు దారి మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ సభకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో భారీసంఖ్యలో ప్రజలు సభకు విచ్చేసే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు

● విజయవాడ, గుంటూరు నుంచి హైవేపై ఒంగోలు, చెన్నై వైపు వెళ్ళు వాహనాలను బుడంపాడు అడ్డరోడ్డు నుండి పొన్నూరు, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. గుంటూరు టౌన్ నుండి ఒంగోలు వెళ్ళు వాహనాలు ఏటుకూరు జంక్షన్ నుండి ప్రత్తిపాడు, పర్చూరు, ఇంకొల్లు, నాగులుప్పలపాడు, త్రోవగుంట, ఒంగోలు వైపు వెళ్ళాలన్నారు. గుంటూరు నుండి నరసరావుపేట మీదుగా ఒంగోలు వెళ్ళవలసిన వాహనాలు చుట్టుగుంట, పేరేచర్ల, ఫిరంగిపురం, నరసరావుపేట, సంతమాగులూరు అడ్డరోడ్డు జంక్షన్, అద్దంకి, మేదరమెట్ల మీదుగా ఒంగోలు వెళ్ళాలన్నారు. 16వ నంబర్ జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజా నుండి బొల్లాపల్లి, మేదరమెట్ల వరకు ఎటువంటి వాహనాలు అనుమతించబడవన్నారు. కేవలం సిద్ధం సభ ప్రాంగణానికి వచ్చు వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఈ ఆంక్షలు మార్చి 10న ఆదివారం ఉదయం 6 గంటల నుండి అమలులోకి వస్తాయన్నారు.

రాజ్యాధికారం కోసం బీసీ నేతలు ఒకే వేదికపైకి రావాలి

● పదవుల కోసం బీసీలకు అన్యాయం చేస్తే ఖబడ్దార్
● కనువిప్పు కాకుంటే బానిసలుగానే బీసీ నేతలు
● ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

గుంటూరు, మార్చి 8: రాజ్యాధికారం సాధనే లక్ష్యంగా బీసీ నేతలు ఇప్పటికైనా ఒకే వేదికపైకి రావాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపునిచ్చారు. పదవుల కోసం బీసీలకు అన్యాయం చేసే బీసీ నేతలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. గుంటూరులోని సంఘ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కార్డు ఉపయోగించుకొని పదవులు పొంది తరువాత బీసీలకే అన్యాయం చేసేలా ఆయా రాజకీయ పార్టీలకు కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. కొందరు బీసీ నేతలు ఆయా పార్టీల అధినేతల మెప్పుకోసం బీసీల ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన రాజకీయ పార్టీల చెప్పుచేతల్లో ఉంటున్న కొందరు బీసీ నేతలు బీసీ ఉద్యమాలను నీరుగార్చేలా చూడటం బాధాకరమన్నారు. జనాభాలో 50శాతం పైగా ఉన్న బీసీ, దళిత, ఆదివాసీ, మైనార్టీ వర్గాల ప్రజలను నమ్ముకుంటే బీసీ నేతలకు రాజ్యాధికారం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. సమావేశంలో సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, సంఘం నేతలు అన్నవరపు నాగమల్లేశ్వరరావు, డీ రామకృష్ణ, కొల్లూరి హనుమంతరావు, నాగుల్‌మీరా తదితరులున్నారు.

కొత్తపేట పరిధిలో కేంద్ర బలగాల కవాతు


కొత్తపేట స్టేషన్ పరిధిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ అన్వర్‌బాషా

గుంటూరు: గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఈస్ట్ ఏఎస్పీ నచికేత్ శెల్కేల ఆదేశాల మేర కు శుక్రవారం రాత్రి కొత్తపేట సిఐ అన్వర్ బాషా, సిబ్బంది రానున్న ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకుగాను కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పొత్తూరివారితోట, గుంటూరు వారి తోట, రామిరెడ్డి తోట తదితర ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా అవాంచనీయ ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ అన్వర్‌బాషా హెచ్చరించారు.

రాజధాని గ్రామాలలో...

తుళ్లూరు, మార్చి 8: మండల పరిధిలోని మూడు రాజధాని గ్రామాలలో పోలీసులు శుక్రవారం కవాతు నిర్వహించారు. మందడం, మల్కాపురం, వెలగపూడి గ్రామాలలో తుళ్లూరు డీఎస్పీ అశోక్ గౌడ్ నేతృత్వంలో ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మార్చ్ ఫాస్ట్ చేసినట్టు డీఎస్పీ తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తుళ్లూరు సీఐ సుభాని సిబ్బంది పాల్గొన్నారు.


మల్కాపురంలో కవాతు చేస్తున్న డీఎస్పీ అశోక్‌గౌడ్, పోలీసులు

ప్రత్తిపాడులో..

ప్రత్తిపాడు: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ముందస్తుగా పోలీసులు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రత్తిపాడు సీఐ నిస్సార్‌బాషా ఆధ్వర్యంలో ఎస్‌ఐ సోమేశ్వరరావు సీఏపీఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలతో ప్రత్తిపాడుతోపాటు గొట్టిపాడు, యనమదల గ్రామాలలో కవాతు నిర్వహించారు.

మజ్లిస్ ఉల్ ఉలమాకు చట్టబద్ధ స్థలం కేటాయించాలి

మొహమ్మద్ నసీర్


శంకుస్థాపన కార్యక్రమంలో నసీర్‌ను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే అనుచరులు

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మజ్లిస్ ఉల్ ఉలమాకు చట్టబద్ధమైన స్థలం కేటాయించాలని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ డిమాండ్ చేశారు. తూర్పు నియోజకవర్గంలోని బస్టాండ్ రోడ్డులోని ఎర్రచెరువు ప్రాంతంలో మజ్లిస్ ఉల్ ఉలమాకు కేటాయించిన స్థలంలో శుక్రవారం ఎమ్మెల్యే ముస్తఫా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి నసీర్ ఉత్తుత్తి స్థలాలకు శంకుస్థాపనలు కాదు చట్టబద్ధంగా స్థలం కేటాయించాలని, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దానిని ధ్రువపరచాలని ఎమ్మెల్యేను కోరారు. ముస్లిం సమాజానికి దశ, దిశా నిర్దేశించే మజ్లిస్ ఉల్ ఉలామా సభ్యులందరిని ఆకట్టుకోడానికి ఎమ్మెల్యే ముస్తఫా కొత్తఎత్తులు వేస్తున్నారన్నారు. నగర కమిషనర్, మేయర్ పాల్గొనకుండా ఎన్నికల నోటిఫికేషన్‌కు వారం ముందు ఈవిధంగా శంకుస్థాపన చెయ్యడం వెనక మర్మం ఏమిటని ప్రశ్నించారు. శంకుస్థాపన చేసి చేతులు దులుపుకోకూడదని కోరినందుకు ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అడ్డుకున్నారన్నారు. రెండు సంవత్సరాలుగా అడుగుతున్నా ఇవ్వకుండా పదిరోజుల్లో ఏం పనులు జరుగుతాయని ప్రశ్నించారు.

చంద్రబాబు మళ్లీ సీఎం కావాలి: మన్నవ మోహనకృష్ణ


శివాలయంలో పూజ చేస్తున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ కోరు కున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పలు శివాలయాల్లో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు.

విద్య, వైద్యం మహిళాభ్యున్నతికి జోడు గుర్రాలు

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి


ప్రొఫెసర్ కే వాణిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గుంటూరు సిటీ, మార్చి 8: విద్య, ఆరోగ్యం మహిళాభివృద్ధికి జోడు గుర్రాల వంటివని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన నారీశక్తి వందన్‌లో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గుంటూరు అమరావతి రోడ్‌లోని హిందూ ఫార్మసీ కాలేజ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్ కె.వాణి, హిందూ కాలేజ్ ఉమెన్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ సీతాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరియాదవ్ మాట్లాడుతూ మహిళలు రాజకీయరంగంలో కూడా ముందంజలో ఉండాలని ప్రధానమంత్రి చట్టసభలలో 33% రిజర్వేషన్ కల్పించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, మహిళా మోర్చా నాయకులు డాక్టర్ స్రవంతి, శ్రీలక్ష్మి, అనుపమ, మహాలక్ష్మి, మంత్రి సుగుణ, సరోజినీ, ఏలూరి లక్ష్మి, రేణుకాదేవి, రమాదేవి, హిందూ ఫార్మసీ కాలేజ్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ లేదు

● వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా

గుంటూరు, మార్చి 8: తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో రాజీలేకుండా కృషిచేస్తామని తూర్పు వైసీపీ సమన్వయకర్త నూరిఫాతిమా పేర్కొన్నారు. 54వ డివిజన్ రాజీవ్‌గాంధీనగర్, శివనాగరాజు కాలనీ, ఆదిత్యనగర్ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఆమె స్థానిక కార్పొరేటర్ రమ్యతో కలిసి ప్రారంభించారు. అలానే బస్టాండ్ సమీపంలోని రెడ్‌ట్యాంక్ ఏరియాలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు తూర్పు ఎమ్మెల్యే ఎండీ ముస్తఫా శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసీపీ నేత గులాం రసూల్, పలువురు ముస్లిం సంఘాల నాయకులు ఉన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుంటూరు, మార్చి 8: విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా రెండో శనివారం పురస్కరించుకొని నగరంలోని పలు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు టౌన్-1 ఈఈ టి శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్‌ల నిర్వహణతోపాటు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని మహిళ ఆత్మహత్యాయత్నం

గుంటూరు: గుంటూరు రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని మహిళ గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. ఈ ఘటనలో ఆమె రెండు చేతులు విరిగిపోయాయి. ఆమె తన పేరు లక్ష్మి అని, తనది గుంటూరు అని మాత్రమే చెబుతుందని జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమె వయస్సు సుమారు 55 - 60 మధ్య ఉంటాయన్నారు. ఆమె వివరాలు తెలిసినవారు సీఐ వెంకటేశ్వర్లుకు 9440627546లో గానీ, ఎస్సై వెంకటాద్రికి 7207076614లో తెలియచేయాలని రైల్వే పోలీసులు కోరారు.

మహిళా చైతన్యంతోనే సమాజ అభివృద్ధి

గుంటూరు(విద్య), మార్చి 8: అన్ని రంగాలలో చైతన్యంతో మహిళలు ముందడుగు వేసినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని జనసాహితీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి డాక్టర్ బి.అరుణ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కొరిటపాడులోని ఓరియంటల్ హైస్కూల్‌లో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి. పార్వతి అధ్యక్షతన మహిళ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీ అరుణ మాట్లాడుతూ అవకాశాలు అందిపుచ్చుకుని అన్ని రంగాలలో మహిళలు ముందడుగు వేయాలన్నారు. మరో ముఖ్య అతిథి, ఏపీటీఎఫ్ ఎన్టీఆర్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, రచయిత వి.రాధిక మాట్లాడుతూ మహిళలు అందరూ ఒక ఉద్యమంలా పనిచేసి మహిళా సాధికారతని సాధించాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ పూర్వ ఉపాధ్యక్షులు బి.మల్లీశ్వరి, జిల్లా మహిళా కార్యవర్గ కన్వీనర్ డి. నాగభారతి, జిల్లా గౌరవ అధ్యక్షులు టి.రామలీల, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు బి.సాయిలక్ష్మి, ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్, గుంటూరు జోన్ కన్వీనర్ పి.నాగ శివన్నారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జి.దాస్, కె.రమేష్, పి.లక్ష్మీనారాయణ, బాలరాజు, శివరామకృష్ణ, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ కార్యాలయంలో...

గుంటూరు(విద్య), మార్చి 8: స్థానిక కంకరగుంటలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏఐఎస్టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి జోసెఫ్ సుధీర్‌బాబు, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.పెదబాబు, అధ్యక్షుడు డీకే సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను ఘనంగా సన్మానించారు. సుధీర్‌బాబు మాట్లాడుతూ ఎస్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయుల తరపున నిరంతరం పోరాటం చేస్తుందని... మహిళా సాధికారత కొరకు పనిచేస్తుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ మహిళలు ప్రతి రంగంలో ముందుండాలని.. వారు అన్ని విషయాల్లో ఇతరులతో పోటీ పడి తమను తాము నిరూపించుకోవాలని కోరారు. కార్యదర్శి డి.పెద బాబు ప్రసంగిస్తూ మహిళలు ఆర్థికస్వాలంబన కోసం నిరంతర కృషిచేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడిమళ్ళ ప్రసాద్, ఆర్థికకార్యదర్శి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మనువాద రాజకీయాలను ప్రతిఘటించాలి

గుంటూరు(తూర్పు), మార్చి 8: ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, మనువాద రాజకీయాలను ప్రతిఘటిద్దామని, మహిళల హక్కులను రక్షించుకుందామని ఆంధ్రప్రదేశ్

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సంగీరెడ్డి వాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక గుంటూరు మల్లయ్యలింగం భవన్ వద్ద జెండాను ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాలకపక్షాలు మహిళా రక్షణ కోసం ఎన్ని కొత్త కొత్త చట్టాలు తెచ్చినా మహిళలపై, ఆడపిల్లలపై అత్యాచారాలు అడుగడుగునా జరుగుతూనే ఉన్నాయన్నారు. కఠినచట్టాలు తెచ్చి అత్యాచారాల నుండి మహిళలు రక్షించాలని కోరారు. కార్యమంలో జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, గుండెబోయిన లక్ష్మి, మేరుగ నాగలక్ష్మి, నాయుడు గంగాదేవి, సి.విజయలక్ష్మి, నాగేంద్రం, రమాదేవి, ఫ్లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలి

గుంటూరు(విద్య), మార్చి 8: వ్యక్తిగత అభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతలోనూ మహిళలు చురుకైన పాత్ర పోషించాలని సామాజిక కార్యకర్త వసుంధర పిలుపునిచ్చారు. యూటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమానికి జిల్లా సహాధ్యక్షురాలు ఏఎన్ శివపార్వతి అధ్యక్షత వహించారు. రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి మాట్లాడుతూ మహిళలు అంతా విద్యావంతులు కావాలి.కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బీ ఆదిలక్ష్మి, ఎం కళాధర్, జిల్లా కార్యదర్శులు ధనలక్ష్మి, షకీలా బేగం, ఐద్వా జిల్లా కార్యదర్శి అరుణ, బేబీ, రాధ పాల్గొన్నారు.

● గుంటూరు(తూర్పు): స్థానిక ఎస్వీఎస్ కాలనీ, వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐడి, ఉమెన్స్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ కేజీవీ సరిత హాజరై మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణించడం అభినందనీయమన్నారు. చంద్రయాన్ విజయవంతంలో మహిళా శాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. అనంతరం గత మూడురోజులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సరిత చేతుల మీదగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

● స్థానిక అమరావతి రోడ్డులో డెవలప్ ట్రీస్ రీడిఫైనింగ్ ఐటి సొల్యూషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి చైర్మన్ దగ్గుబాటి శ్రావణ్ చౌదరి హాజరై విధుల్లో ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులకు బహుమతులు అందజేశారు.


సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొన్న మహిళలు


మహిళా ఉపాధ్యాయులకు సత్కారం


ఎస్పీ సరితను సత్కరిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

‘ప్లానింగ్’లో పీజీ

దిక్సూచి



విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(ఎస్‌పీఏవీ)- పీజీ ప్రోగ్రామ్‌లలో డైరెక్ట్ అడ్మిషన్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ విభాగాల్లో 12 రెగ్యులర్ సీట్లు; డిజైన్ విభాగంలో 13 రెగ్యులర్ సీట్లు, 12 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.

ఆర్కిటెక్చర్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ప్రోగ్రామ్‌లో సస్టయినబుల్ ఆర్కిటెక్చర్, ల్యాండ్ స్కేప్ ఆర్కిటెక్చర్, ఆర్కిటెక్చరల్ కన్జర్వేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: మాస్టర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, మాస్టర్ ఆఫ్ అర్బన్ డిజైన్, మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బ్యాచిలర్స్ డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ పూర్తి చేసి ఉండాలి. మాస్టర్ ఆఫ్ బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌కు(బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ/కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్/కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి. మాస్టర్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రామ్‌కు బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, ఏడాది అనుభవం ఉన్నవారు; బ్యాచిలర్స్ డిగ్రీ(ఫైన్ ఆర్ట్స్/డిజైన్) ఉత్తీర్ణతతోపాటు సీడ్ వ్యాలిడ్ స్కోర్, రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ప్లానింగ్: ఈ విభాగంలో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్ ప్రోగ్రామ్ ఉంది. ఇందులో ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్, ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ప్లానింగ్/ ఆర్కిటెక్చర్) లేదా (బీఈ/బీటెక్)(సివిల్ ఇంజనీరింగ్/ప్లానింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎన్విరాన్‌మెంటల్ ప్లానింగ్, అర్బన్ అండ్ రీజనల్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌లకు మాస్టర్స్ డిగ్రీ(జాగ్రఫీ/ఎకనామిక్స్/సోషియాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు; ట్రాన్స్‌పోర్ట్ ప్లానింగ్ స్పెషలైజేషన్‌కు మాస్టర్స్ డిగ్రీ(ఎకనామిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్స్ రీసెర్చ్) ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

అడ్మిషన్ ప్రక్రియ: అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. సంస్థ నిర్ణయం మేరకు ఇందులో అర్హత పొందినవారికి సంబంధించి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ పరిశీలన, పోర్ట్‌ఫోలియో అసెస్‌మెంట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **వెబ్‌సైట్:** www.spav.ac.in

‘దిక్సూచి’ వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Op0mxNDలో చదవండి.

సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా లఫూట్



నందమూరి బాలకృష్ణ దర్శకుడు బాబీ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం ఫస్ట్ గ్లింప్స్‌ను మహా శివరాత్రి సందర్భంగా విడుదల చేశారు. యాక్షన్ సీక్వెన్స్‌తో రూపొందించిన ఈ గ్లింప్స్‌లో బాలకృష్ణ కూల్‌గా, ప్రశాంతంగా కనిపిస్తూనే తనదైన శైలిలో పవర్‌ఫుల్ డైలాగ్‌తో అదరగొట్టారు. కొంతమంది గూండాలు తన వైపు పరిగెత్తుకుని వస్తుంటే బాలయ్య కూల్‌గా ఆల్కహాల్ తాగుతుండడం ఆకట్టుకుంది. ‘ఎంట్రా వార్ డిక్లేర్ చేస్తున్నావా’ అని వచ్చిన వాళ్లలో ఒకడు అడిగితే ‘సింహం నక్కల మీదకు వస్తే వార్ అవదురా.. ఇట్స్ కాల్డ్ హంటింగ్’ అంటూ పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పి బాలకృష్ణ వేట మొదలుపెట్టడం గూస్ బంప్స్ తెప్పించేలా ఉంది. ఈ గ్లింప్స్ బాలకృష్ణ అభిమానుల్నీ, సినీ ప్రియుల్నీ విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఇందులో ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎస్.ఎస్. థమన్, ఫొటోగ్రఫీ: విజయ్ కార్తిక్, ఎడిటింగ్: నిరంజన్, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్, నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య

భైరవుడై.. రక్షకుడై...



నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం ‘కల్కి 2898 ఏడీ’. మే 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం ఈ చిత్రం నుంచి ప్రభాస్ పాత్రను యూనిట్ పరిచయం చేసింది. భైరవగా సరికొత్త లుక్‌లో ప్రభాస్ అలరించారు. భవిష్యత్తులో కాశీ నగరంలో జరిగే కొన్ని సంఘటనల నేపథ్యంలో సాగిన ప్రత్యేక వీడియో సినిమాపై ఆసక్తిని పెంచింది. కాశీ ప్రజలను విలన్ల నుంచి కాపాడే రక్షకుడిగా ప్రభాస్ కనిపించారు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో అలరించనున్నారు. అమితాబ్‌బచ్చన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఇటలీలో ప్రభాస్, దిశా పటానీపై ఓ పాటను చిత్రీకరిస్తున్నారు.

ధనుష్ కుబేర



జాతీయ అవార్డు చిత్రాల దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందిస్తున్న తాజా చిత్రానికి టైటిల్ నిర్ణయించారు. ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు ‘కుబేర’ అని పేరు పెట్టారు. మహాశివరాత్రి సందర్భంగా సినిమా టైటిల్ వెల్లడించి, ఫస్ట్ లుక్ విడుదల చేశారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అత్యంత సంపన్నుడైన దేవుడు కుబేరుడు. ఆయన పేరునే ఈ సినిమాకు పెట్టారు. కానీ విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ లుక్ టైటిల్‌కు భిన్నంగా ఉంది. చిరిగిన బట్టలతో అన్నపూర్ణా దేవి నుంచి శివుడు భిక్ష తీసుకుంటున్న పెయింటింగ్ ముందు ధనుష్ నిలబడి కనిపించారు. దీంతో ఆయన పాత్ర ఎలా ఉంటుందో అనే ఆసక్తి పెరిగింది. అలాగే మరో కీలక పాత్ర పోషిస్తున్న నాగార్జున లుక్ ఎలా ఉంటుందా అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. రష్మిక ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

కాశీలో శివశక్తి



తమన్నా ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం ‘ఓదెల 2’. ‘ఓదెల రైల్వేస్టేషన్’ చిత్రానికి ఇది సీక్వెల్. ఇటీవలే కాశీలో చిత్రీకరణ ప్రారంభమైంది. అశోక్‌తేజ దర్శకత్వంలో డి. మధు నిర్మిస్తున్నారు. ఇందులో తమన్నా శివశక్తి అనే పాత్ర పోషిస్తున్నారు. శివరాత్రి సందర్భంగా ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నాగా సాధువు అవతారంలో తమన్నా సరికొత్తగా కనిపించారు. ఈచిత్రంలో హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహ కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అదిగో కన్నప్ప



పరమశివుని భక్తుడు కన్నప్ప జీవితగాథ ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం ‘కన్నప్ప’. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్నాడు. శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం నుంచి కన్నప్ప పాత్రధారిగా విష్ణు ఫస్ట్‌లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. విల్లు ఎక్కుపెట్టిన భంగిమలో శక్తిమంతంగా కనిపించి ఆకట్టుకున్నారు. ‘గొప్ప శివభక్తుని పాత్రలో నటించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇదిగో మీ కన్నప్ప... హర హర మహదేవ్’ అని విష్ణు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ దర్శకుడు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మించడంతో పాటు కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రభాస్ పరమశివుని పాత్ర పోషిస్తున్నారు. శరత్‌కుమార్, మోహన్‌లాల్ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

ఎనిమిది భాగాలుగా హాఫ్ లయన్



ప్రకాశ్ ఝా

దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితం ఆధారంగా ప్రముఖ ఓటీటీ సంస్థ ‘ఆహా’ ‘హాఫ్ లయన్’ పేరుతో వెబ్‌సిరీస్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. వినయ్ సీతాపతి రచన ‘హాఫ్ లయన్’ పుస్తకం దీనికి ఆధారం. ప్రకాశ్ ఝా దర్శకత్వంలో ఆహా స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సిరీస్ గురించి ఓ ఇంటర్వ్యూలో ప్రకాశ్ ఝా మాట్లాడుతూ ‘పీవీ నరసింహారావు ప్రధానిగా తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఉమ్మడి ఆంధ్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా ఆయన జీవితంలోని కీలకఘట్టాలను స్పృశిస్తూ ఈ సిరీస్ సాగుతుంది. ‘తెలుగువాళ్లు గర్వించే వ్యక్తి పీవీ, ఆయన బయోపిక్ చేద్దాం’ అని నిర్మాత అల్లు అరవింద్ నన్ను కలిశారు. అలా ఈ ప్రాజెక్ట్ మొదలైంది’ అని చెప్పారు. ఈ సిరీస్ ఎనిమిది ఎపిసోడ్లుగా ఉంటుంది, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పూర్తయింది అని ఆహా సహ వ్యవస్థాపకులు అజిత్ ఠాకూర్ చెప్పారు. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్ తెరకెక్కిస్తున్నాం, త్వరలో నటీనటుల ఎంపిక ప్రారంభించి, ఈ ఏడాది ద్వితీయార్థంలో చిత్రీకరణ ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.



క్వారీలో ఏర్పాటుచేసిన ప్రభలు



క్వారీలో పొంగళ్లు వండుతున్న భక్తులు



కాకానిలో క్యూలైన్లలో నెలకొన్న రద్దీ



కాకానిలో అన్నప్రసాదాలను వడ్డిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

క్వారీలో తిరునాళ్ల కోలాహలం

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభలు
- ఏర్పాట్లపై అధికారుల విఫలం.. భక్తుల ఆగ్రహం

పొన్నూరు టౌన్, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం తిరునాళ్ల సందడి సంతరించుకుంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. కాంతులీనే భారీ ప్రభలు క్వారీకి తరలివచ్చాయి. వడ్లమూడి, నారాకోడూరు, చేబ్రోలు, వేజెండ్ల, సుద్ధపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు విద్యుత్ ప్రభలను నిర్మించి ఆలయానికి తరలివచ్చారు. ప్రభల ఉత్సవాన్ని, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు భక్తులు పోటీపడ్డారు. క్వారీ వద్ద రద్దీ నేపథ్యంలో పోలీసులు వాహనాలను వేర్వేరు మార్గాల్లో మళ్లించారు. క్వారీకి భక్తులు వచ్చేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఆలయం వరకు నడిపింది.



క్వారీలో దర్శనం కోసం ఎండలో బారులు తీరిన భక్తులు



కాకానిలో ప్రసాదాల పంపిణీలో పాల్గొన్న గుంటూరు పార్లమెంటరీ స్థాయి నాయకుడు పెమ్మసాని చంద్రశేఖర్

వైసీపీ నాయకుల సేవలో అధికారులు

అయితే వీఐపీలు, వైసీపీ నాయకుల సేవలో దేవదాయశాఖ, పోలీసు అధికారులు నిమగ్నమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యూల్లో గంటలకొద్దీ భక్తులు బారులు తీరినా అధికారులు ఆలయం వెనుక వైపున ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి మరీ ప్రముఖులు, వైసీపీ నాయకులకు దర్శనం చేయించారు. దీంతో సాధారణ భక్తులు గంటల తరబడి క్యూల్లో వేచి ఉండాల్సి వచ్చింది. శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు కూడా వైసీపీ నాయకుల వాహనాలకు రక్షణ కల్పించడంలో నిమగ్నమయ్యారన్న విమర్శలు వచ్చాయి. అధికార పార్టీ నాయకులను ఆలయం వరకు తీసుకెళ్లడానికి, స్వామి వారి దర్శనం చేయించడానికే పోలీసులు పరిమితమయ్యారన్న ఆరోపణలున్నాయి.

కాకాని.. భక్త జనసందోహం

పెదకాకాని, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శివనామస్మరణతో పెదకాకాని మారుమోగింది. భక్తజన సందోహంతో మల్లన్న సన్నిధి కిక్కిరిసిపోయింది. విశేషంగా భక్తులు కాకాని మల్లన్న సన్నిధికి తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల కొద్దీ క్యూల్లో నిరీక్షించాల్సి వచ్చింది. సాధారణ భక్తులతో పాటు వీఐపీల తాకిడి అధికంగా ఉంది. ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్ కోర్టు జడ్జి జస్టిస్ కేవీఎల్ హరినాథ్, ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపతులు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, గుంటూరు లోక్‌సభ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రా రెడ్డి, పలువురు అధికారులు, అనధికారులు, ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. లింగోద్భవ కాలంలో జరిగిన ప్రత్యేక పూజల్లో కూడా పెద్దసంఖ్యలో వీఐపీలు పాల్గొన్నారు. రాత్రి గజవాహనంపై దేవతమూర్తుల విశ్వ విగ్రహాలతో ఎదుర్కోల జరిపించారు. గజవాహనంపై ఉభయదేవేరి సమేతుడైన మల్లేశ్వరుడు కాకాని పురవీధులల్లో విహరించారు.



సంగమేశ్వర స్వామికి తాళపాలెం, కట్టెంపూడిలో నిర్మించిన 70 అడుగుల విద్యుత్ ప్రభలు, నిజరూపంలో దర్శనం ఇస్తున్న సహస్రలింగేశ్వర స్వామి



నారాకోడూరులో ఏర్పాటుచేసిన సెంటర్ యూత్ ప్రభ

ఆకట్టుకున్న భారీ విద్యుత్ ప్రభలు

పొన్నూరు టౌన్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొన్ని పట్టణ, మండలంలోని శైవాలయాలు శివనామ స్మరణతో మారుమ్రోగాయి. పొన్నూరు పట్టణంలోని ప్రసిద్ధి చెందిన శైవాలయం సహస్రలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొన్ని ప్రత్యేక పూజలు జరిపారు. ఏడాదిపాటు చందన లేపనంతో దర్శనం ఇచ్చే సహస్రలింగేశ్వరస్వామి శివరాత్రి పర్వదినం రోజున ఆ చందన లేపనాన్ని తొలగించి పంచామృత రుద్రాభిషేకాలు నిర్వహించారు. నిజరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చిన సహస్రలింగేశ్వర స్వామిని వీక్షించేందుకు భక్తులు ఆలయానికి బారులు తీరారు. అలాగే మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామ శివారులో ఆరెమండ గ్రామం వద్ద ఉన్న సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కట్టెంపూడి, తాళ్లపాలెం వాసుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రభల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామానికి చెందిన పంచాయతీ కార్యాలయం వద్ద, వినాయకుడి గుడి సెంటర్‌లో రెండు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించారు. తాళ్లపాలెం గ్రామం వద్ద 70అడుగుల భారీ విద్యుత్ ప్రభను సంగమేశ్వరస్వామికి నిర్మించారు. రాత్రికి ఆలయం వద్ద ప్రభల ఉత్సవం కన్నుల పండుగగా జరిగింది. విద్యుత్ ప్రభలను శైవాలయానికి తీసుకువెళ్లేందుకు రెండు గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే పట్టణంలోని పాతపొన్నూరు బాలకోటేశ్వరస్వామి ఆలయం, వల్లభరావుపాలెం ఓంకారేశ్వరస్వామికి, చింతలపూడి మల్లేశ్వరస్వామి, ములుకుదురు రామలింగేశ్వరస్వామి, మామిళ్లపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆయలంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి.



మద్దు జనార్ధనరావుకు నివాళి అర్పిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

మృతుడికి నరేంద్ర నివాళి

పొన్నూరు టౌన్, మార్చి 8: పట్టణంలోని 23వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త మద్దు జనార్ధనరావు శుక్రవారం మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జనార్ధనరావు గృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జనార్ధనరావు కుమారుడు స్రుజన్ కుమార్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు అందజేస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ప్రసాద్



మహిళలను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన మోదీ

- బీజేపీ నాయకురాలు స్వరూపరాణి

తెనాలి అర్బన్, మార్చి 8: మహిళలకు 33శాతం రిజర్వేషన్లు ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేశారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి చెప్పారు. బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పారిశుధ్య మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరోనా కష్టకాలంలో వారి సేవలు అనిర్వచనీయమన్నారు. పార్టీ నాయకులు భవానీ, దుర్గ, సుబ్బాయమ్మ, దానమ్మ, సాయిగుప్తా, శివశంకర్ పాల్గొన్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నందివెలుగు దయానంద వృద్ధాశ్రయంలో మహిళలకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. సంస్థ చైర్మన్ కొలసాని రాంచంద్ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. భక్తి గీతాల కార్యక్రమం జరిపారు. కూరపాటి రవీంద్ర, కళ్యాణి, శ్రీనివాస బాబు, ప్రసాద్, సాంబశివరావు, వెంకట్ పాల్గొన్నారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో మహిళా దినోత్స వేడుకలు నిర్వహించారు. సీఐటీయూ కార్యదర్శి బాబుప్రసాద్ మాట్లాడుతూ, జనాభాలో 50శాతం మహిళలు అణచివేతకు గురవుతున్నారని చెప్పారు. మహిళా సాధికారత సాధించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరిపోవడం లేదన్నారు. కేఎస్‌కుమారి, లావణ్య, గీత, సుజాత, హుస్సేన్‌వలి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ

తెనాలి అర్బన్, మార్చి 8: రూరల్ మండలం అంగలకుదురులో శుక్రవారం పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. రావూరి స్వామ్రాజ్యం వర్ధంతి పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో అలపాటి వెంకట్రామయ్య సుధాకర్, నాగయ్య శివకృష్ణ, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

కొల్లిపర, మార్చి 8: మండల పరిధిలోని తూములూరు శ్రీసరస్వతీ విద్యాపీఠం స్వర్ణోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణతో పాటు నృత్య పోటీలు, దేశభక్తి గేయాలు, నాటికలను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ సాయిప్రసూన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యనందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ కొల్లి బసివిరెడ్డి, కార్యదర్శి అవుతు వేమారెడ్డి, ప్రధానాచార్యులు ఆర్. శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి అమృత్ పథకం తోడ్పాటు

తెనాలి అర్బన్, మార్చి 8: మున్సిపల్ నిధులతో పాటు పట్టణ అభివృద్ధికి అమృత్ పథకం నిధులు తోడ్పడుతున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. 32వ వార్డులో అన్నాబత్తుని సత్యనారాయణ అమృత్ మున్సిపల్ పార్కును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ శేషన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు. సంగం జాగర్లమూడి ఎస్టీ కాలనీలో 15వ ఆర్థికసంఘం నిధులతో ఏర్పాటుచేసిన ఇంటింటికి కుళాయి పథకాన్ని ప్రారంభించారు. జగ్గడిగుంటపాలెంలో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు.



పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- అర్ధరాత్రి స్వామి వారికి లింగోద్భవ పాలాభిషేకం

తెనాలి అర్బన్, మార్చి 8: మహా శివరాత్రి పురస్కరించుకుని పట్టణంతో పాటు రూరల్ మండల గ్రామాల్లోని శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు హరోంహరా అంటూ శివుడిని దర్శించుకున్నారు. పలు ప్రసిద్ధి ఆలయాలలో తెల్లవారు జామునుంచే అభిషేకాలకు జనం పోటెత్తారు. రూరల్ మండలంలోని సంగం జాగర్లమూడి సంగమేశ్వరస్వామికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ అధికారులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పరశురామ ప్రతిష్ఠిత పాత శివాలయంలో శ్రీపర్వత వర్ధిని సమేత రామేశ్వరస్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. స్వామి వారికి రావణ బ్రహ్మ వాహన సేవ నిర్వహించారు. రాత్రి 12.06 నిమిషాలకు లింగోద్భవ కాల పాలాభిషేకం జరిపారు. అర్ధరాత్రి స్వామి అమ్మవార్లకు ఎదురుకోల ఉత్సవం జరిపిన అనంతరం రామేశ్వరస్వామికి దివ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈవో రమణకుమారి, ట్రస్ట్ సభ్యులు, ప్రధాన అర్చకులు పీవీ సురేష్ ఆధ్వర్యంలో అర్చక బృందం సేవలు అందించారు. రామలింగేశ్వరపేట శివాలయం, మారీసుపేట చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పూజలకు భక్తులు భారీగా తరలివచ్చారు. కోదండ రామస్వామి ఆలయంలో సాల గ్రామాలతో చేసిన శివునికి పూజలు నిర్వహించారు. ధర్మకర్త ఆనంద్‌కుమార్, శివాంజనేయ ప్రసాద్, నారాయణస్వామి పర్యవేక్షించారు. చినరావూరు సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రూరల్ మండలం ఖాజీపేటలో కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వర స్వామికి రుద్ర హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. చైర్మన్ రాచర్ల సాంబయ్య, సత్యనారాయణ, రంగారావు పాల్గొన్నారు. శివాజీచౌక్‌లోని కాళీ మాత ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మడి రమేష్, కార్యదర్శి శ్రీనివాసరావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

- కొల్లిపర, మార్చి 8: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. తెల్లవారు జామున శివసన్నిధిలో సుప్రభాతసేవ, వివిధ అభిషేకాలు భక్తులతో అర్చకులు పూజలు జరిపించారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన మున్నంగి భీమేశ్వరస్వామి ఆలయం ఒకటి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని వల్లభాపురం, తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, దావులూరు, చివలూరు, సిరిపురం, అత్తోట, దంతలూరు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొల్లిపర గంగా పార్వతీ సమేత ముక్తేశ్వరస్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వర్ల కల్యాణ మహోత్సవాన్ని రంగ, రంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని చూడటానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.



ప్రత్యేక అలంకారంలో పూజలందుకున్న సంగమేశ్వర స్వామి



సంగం జాగర్లమూడిలో పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే శివకుమార్



కొల్లిపర శివాలయంలో అభిషేకం నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న భక్తులు

చినరావూరు ఆలయంలో...

- తెనాలి అర్బన్, మార్చి 8: చినరావూరులోని సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పురస్కరించుకుని భక్తులు భారీసంఖ్యలో అభిషేకాలు చేశారు. శుక్రవారం సాయంత్రం నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకం చేశారు. స్వామివారి కల్యాణం, లింగోద్భవ అభిషేకాలను ఈవో హరిబాబు, ప్రధాన అర్చకుడు ఈశ్వర్ తదితరులు పర్యవేక్షించారు.



కోదండ రామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



శివాజీ చౌక్‌లో అన్నదానం చేస్తున్న రమేష్ తదితరులు



చినరావూరులో నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

పొన్నూరు టౌన్, మార్చి 8: పట్టణంలోని నిడుబ్రోలు 11వ వార్డులో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను 11వ వార్డులో ఊరేగించారు.

కోదండ రామాలయం వద్ద చలివేంద్రం ప్రారంభం

పొన్నూరు టౌన్, మార్చి 8: పట్టణంలోని తెలగపాలెం రామమందిరం వద్ద పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కోదండ రామాలయం చైర్మన్ అల్లం సాంబయ్య ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి పాదచారులకు, భక్తులకు తాగునీరు అందచేశారు. కార్యక్రమంలో బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ మద్ది పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ప్రగతితో దేశ పురోభివృద్ధి

- ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ప్రసాద్

తెనాలి అర్బన్, మార్చి 8: మహిళలు ప్రగతి బాట పడితే దేశం పురోభివృద్ధి చెందుతుందని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ నోరి ప్రసాద్ అన్నారు. గాంధీచౌక్‌లోని ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. జేఎంజే కళాశాల ప్రిన్సిపాల్ షైనీని సత్కరించారు. ముగ్గురు మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నిరంగాల్లో మహిళలు ఎదుగుతూ ఉన్నారని, అంతరిక్షానికి సైతం చేరుకోవడం మంచి పరిణామమన్నారు. ప్రియాంక, అలేఖ్య, చందన, చీఫ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. సెంటర్ ఫర్ ఉమెన్స్ నెట్‌వర్క్ కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. చెంచుపేటలోని సంస్థ డైరెక్టర్ జ్యోతిర్మయి, కార్యదర్శి శిరీష, సునీత, శోభారాణి ప్రసంగించారు. మహిళలు పురుషుల కంటే దీటుగా రాణించాలన్నారు. ఉజ్వల భవిష్యత్ నిర్మించడానికి పిల్లలను చదివించాలని కోరారు. బాలికల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



బాల బాలికలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ థెరీసమ్మ

చావావారిపాలెంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరం

తెనాలి అర్బన్, మార్చి 8: రూరల్ మండలం చావావారిపాలెంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగించారు. వారంరోజుల పాటు జేఎంజే కళాశాల విద్యార్థులు గ్రామంలో సేవలు అందించారు. వీధులు, కాల్వలు శుభ్రం చేయడం, మొక్కలు నాటడం, సామాజిక అంశాలలో అవగాహన కల్పించడం, ర్యాలీలు, ఉచిత వైద్యశిబిరాలు జరిపారు. సర్ఫ్, జెండుబామ్, ఫినాయిల్ తయారుచేసే విధానాన్ని మహిళలకు శిక్షణ ఇచ్చారు. బాల, బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ థెరీసమ్మ, ప్రిన్సిపాల్ షైనీ, కౌన్సిలర్ అనీల్, సర్పంచ్ కిరణ్, బెంజిమెన్, అరుణసుజాత పాల్గొన్నారు.

రేపు సీఎం సభ..వాహన రాకపోకలు దారి మళ్ళింపు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు, మార్చి 8: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలో మార్చి 10న జరగనున్న సిద్ధం సభ నేపథ్యంలో వాహన రాకపోకలు దారి మళ్ళిస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈ సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వస్తున్న నేపథ్యంలో భారీ సంఖ్యలో ప్రజలు సభకు విచ్చేసే అవకాశం ఉన్నందున ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలను దారి మళ్లించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

- విజయవాడ, గుంటూరు నుంచి హైవేపై ఒంగోలు, చెన్నై వైపు వెళ్ళు వాహనాలను బుడంపాడు అడ్డరోడ్డు నుంచి పొన్నూరు, బాపట్ల, చీరాల, త్రోవగుంట మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు.
- గుంటూరు టౌన్ నుంచి ఒంగోలు వెళ్ళు వాహనాలు ఏటుకూరు జంక్షన్ నుండి పత్తిపాడు, పర్చూరు, ఇంకొల్లు, నాగులుప్పలపాడు, త్రోవగుంట, ఒంగోలు వైపు వెళ్ళాలన్నారు.
- గుంటూరు నుంచి నరసరావుపేట మీదుగా ఒంగోలు వెళ్ళవలసిన వాహనములు చుట్టుగుంట, పేరేచర్ల, ఫిరంగిపురం, నరసరావుపేట, సంతమాగులూరు అడ్డరోడ్డు జంక్షన్, అద్దంకి, మేదరమెట్ల మీదుగా ఒంగోలు వెళ్ళాలన్నారు.
- 16వ నంబర్ జాతీయ రహదారిపై బొల్లాపల్లి టోల్ ప్లాజా నుంచి బొల్లాపల్లి మేదరమెట్ల వరకు ఎటువంటి వాహనాలు అనుమతించమన్నారు. కేవలం సిద్ధం సభ ప్రాంగణానికి వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తామన్నారు. ఈ ఆంక్షలు మార్చి 10న ఆదివారం ఉదయం 6 గంటల నుంచి అమలులోకి వస్తాయన్నారు.